క్లుప్తంగా

నిబంధనల ప్రకారం ఉపాధి పనులు జరగాలి



నిజాంసాగర్(జుక్కల్) : ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా ఉపాధి పనులు చేయాలని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ కూలీలకు సూచించారు. శనివారం జుక్కల్ మండలంలోని పెద్దఏడ్గి, పడంపల్లి గ్రామాల్లో కూలీలు చేపడుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు ఉన్నారు.

లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా కిషన్



పిట్లం(జుక్కల్): 2024–25కు గాను లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా కిషన్‌ను నియమించినట్లు లయన్స్ జిల్లా గవర్నర్ నగేష్ పంపాటి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కిషన్ పిట్లం మండలంలో చేసిన సేవలను గుర్తించి పిట్లం, నారాయణఖేడ్, మెదక్, జహీరాబాద్ క్లబ్‌లకు జోన్ చైర్మన్‌గా నియమించడం జరిగిందన్నారు.

జయంతి వేడుకలకు తరలిన నేతలు



భిక్కనూరు : జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో శనివారం నిర్వహించిన మహనీయుల జయంతి వేడుకలకు దళిత సంఘాల నేతలు భిక్కనూరు మండలం నుంచి తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మన్ మాదిగ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్‌ను మహనీయుల జయంతి నెలగా ప్ర కటించాలని డిమాండ్ చేశారు. తరలి వెళ్లిన వా రిలో నేతలు బాబు, రాజు, కనకరాజు, రామస్వామి, నర్సింలు, మహేష్ తదితరులున్నారు.

భిక్కనూర్‌లో కుస్తీ పోటీలు



ఎల్లారెడ్డి రూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని భిక్కనూర్ గ్రామంలో శనివారం కుస్తీ పోటీలను నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. కుస్తీ పోటీలకు చుట్టు పక్కల మండలాలకు చెందిన మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి వెండి కడియం వరకు కుస్తీ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీకాంత్, సుఖేందర్ రెడ్డి తదితరులున్నారు.

బీర్కూర్‌లో కొనుగోలు కేంద్రాల మూసివేత



బాన్సువాడ : బీర్కూర్ సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిలిపివేయడంతో రైతులు సొసైటీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 1న ప్రభుత్వ పరంగా అన్ని సహకార సంఘాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. కానీ బీర్కూర్ సహకార సంఘంలో మాత్రం వారం రోజులే ధాన్యం కొనుగోళ్లను జరిపి తర్వాత కేంద్రాలను నిలిపివేడంతో రైతులు సహకార సంఘంకు వెళ్లి కార్యదర్శి మిరుదొడ్డి విఠల్‌పై తీవ్రంగా మండిపడ్డారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బంది పడుతుంటే కొనుగోలు కేంద్రం మూసివేయడమేమిటని వారు ఆగ్రహించారు. తక్షణమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తామని అన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



భిక్కనూరు : గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన భిక్కనూరు మండలంలోని సిద్దరామేశ్వరనగర్, గుర్జకుంట, ర్యాగట్లపల్లి, బస్వాపూర్ గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతివారం మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని నీరు వృథా కాకుండా చూడాలని సూచించారు. జీపీ కార్యదర్శి సౌజన్య ఉన్నారు.

ఇరుకు గదుల్లో ఇంకెన్నాళ్లు..!

- రెండు గదులు.. ఐదు మండలాలు
- దోమకొండ ఐసీడీఎస్ పరిధిలో 238 సెంటర్లు
- చెట్ల కిందే సమావేశాలు



దోమకొండలోని ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం

దోమకొండ : దోమకొండలోని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(ఐసీడీఎస్) కార్యాలయం కేవలం రెండు ఇరుకు గదులతో ఇబ్బందుల్లో నడుస్తోంది. ఐదు మండలాల నుంచి అంగన్‌వాడీలకు సేవలను అందించే సీడీపీవో కార్యాలయం ఇరుకుగా ఉండగా, కార్యాలయానికి వచ్చిన వివిధ మండలాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామాల నుంచి సమావేశాల కొసం కార్యాలయానికి వచ్చిన అంగన్‌వాడీలు కనీసం సేద తీరటానికి కూడా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనాన్ని దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించారు. దోమకొండతో పాటు, భిక్కనూరు, మాచారెడ్డి, బీబీపేట, రాజంపేట మండలాల నుంచి అంగన్‌వాడీలు వివిధ పనుల నిమిత్తం ఇక్కడి కార్యాలయానికి వస్తుంటారు. ఐసీడీఎస్ సీడీపీవో పరిధిలోని ఐదు మండలాల్లో మొత్తం 238 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 210 మెయిన్ కేంద్రాలు కాగా, మరో 28 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రతినెలా అధికారులు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సమావేశాలు నిర్వహిస్తారు. కార్యాలయం ఇరుకుగా ఉండి, స్థలం లేకపోవడం వల్ల కార్యాలయం బయట చెట్ల కింద కూర్చునే పరిస్థితి ఉంది. ఎండాకాలం, వర్షాకాలం కార్యాలయం పక్కనే ఉన్న బీసీ వసతిగృహంలో సమావేశాలు పెడుతున్నారు. ఎంతో దూర ప్రాంతాల నుంచి తమకు కనీసం కార్యాలయం వద్ద కూర్చోడానికి కూడా ఇబ్బందిగా ఉందని పలువురు అంగన్‌వాడీలు ఆయాలు పేర్కొంటున్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఐసీడీఎస్ సీడీపీవో నూతన కార్యాలయం నిర్మించాలని వారు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



దోమకొండ ఐసీడీఎస్ సీడీపీవో పరిధిలో ఐదు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 238 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రతినెలా అంగన్‌వాడీలకు సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కూర్చోడానికి కూడా ఇబ్బందిగా ఉంది. సీడీపీవో కార్యాలయం గత 30 ఏళ్ల క్రితం నిర్మించారు. కేవలం రెండు గదులు మాత్రమే ఉన్నాయి.సమావేశాలు చెట్ల కింద లేదా పక్కనే ఉన్న బీసీ బాలుర వసతిగృహంలో ఏర్పాటు చేస్తున్నాము. ఈ విషయం జిల్లా అధికారులకు కూడా తెలియజేశాను. నూతన భవనం నిర్మిస్తే బాగుంటుంది.

– రోశిష్మ, ఐసీడీఎస్ సీడీపీవో, దోమకొండ

నిన్నొక పార్టీ.. నేడొక పార్టీ..



బీజేపీలో చేరిన బంజారాహిల్స్ కాలనీ ప్రజలు



కాంగ్రెస్ చేరిన బంజారాహిల్స్ ప్రజలు

నిజాంసాగర్(జుక్కల్) : పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైన నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు రోజుకో పార్టీ కండువాలు మారుస్తున్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని బంజారాహిల్స్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బీజేపీ పార్టీలో చేరారు. బీజేపీ పార్టీ కండువాలు కప్పుకుని 24 గంటలు గడవక ముందే శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్ సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకొని హస్తం పార్టీలో చేరారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానికులు అవాక్కయ్యారు.

కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

రామారెడ్డి(ఎల్లారెడ్డి) : జహీరాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండల కేంద్రం సదాశివనగర్‌లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంగారెడ్డి, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, సేవా దళ్ అధ్యకుడు లింగా గౌడ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సంపత్ గౌడ్,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల భాగయ్య తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుర్మ సాయిబాబా అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉషాగౌడ్, సొసైటీ వైస్ చైర్మెన్ ప్రశాంత్‌గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్‌గౌడ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన బిచ్కుంద నాయకులు



బీబీపేటలో..



జంగంపల్లి వాసులు..

బిచ్కుంద(జుక్కల్) : రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని ఉమ్మడి జిల్లా జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అసద్‌అలీ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వెంట బిచ్కుంద మాజీ ఉప సర్పంచ్ నాగరాజు, మున్నూర్ కాపు సంఘం నాయకుడు దర్పల్ దశరథ్ స్వామి, తుకరాం, ఖలీల్, పెద్దకొడప్‌గల్ కోఆప్షన్ మెంబర్ జాఫర్, బీఎస్‌పీ నాయకుడు బొగడమీది సాయి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

జంగంపల్లి వాసులు

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన 187 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు పలు యువజన సంఘాలకు చెందిన ప్రతినిధులు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరని వీరందరికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాలిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీంరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నరేష్, డీసీసీబీ డైరెక్టర్ గోండ్ల సిద్దరాములు, నేతలు ప్రకాశ్, మహేష్, బాబు, రాజేందర్ శ్రీరాం వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

బీబీపేటలో..

బీబీపేట : బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శివారు రాంరెడ్డి పల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్, బీఆర్‌ఎస్ జిల్లా యువజన నాయకుడు అగ్గి రవీందర్, బీర్‌ఎస్ పార్టీకి చెందిన మరికొంత మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.

సెల్‌ఫోన్ల అందజేత



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న పలువురికి శనివారం ఎస్సై మహేష్ సెల్‌ఫోన్లు అందజేశారు. మండలంలోని ఎల్లారెడ్డి, అడివిలింగాల గ్రామాలకు చెందిన నర్సింలు, బోరంచ భాస్కర్లు ఫోన్లు పోగొట్టుకుని సీఈఐఆర్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంతో వారి ఫోన్ల ఆచూకీని కనుక్కుని బాధితులకు అందించినట్లు ఎస్సై తెలిపారు.

మద్నూర్‌కు చేరిన ఎన్నికల సామగ్రి



ఎన్నికల సామగ్రితో అధికారులు

మద్నూర్(జుక్కల్) : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలక్షన్ కమిషన్ జుక్కల్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సామగ్రి శుక్రవారం రాత్రి మద్నూర్‌కు చేరుకుంది. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సామాగ్రిని అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని గదులలో అధికారులు భద్రపరిచారు. జిల్లా కేంద్రంలోని వేర్‌హౌస్‌లో భద్రపరిచిన జుక్కల్ నియోజికవర్గ ఈవీఎం యంత్రాలను నియోజికవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో మద్నూర్‌కు తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, పిట్లం తహసీల్దార్ వేణుగోపాల్, నాయబ్ తహసీల్దార్ భరత్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ విజయ్, ఆర్ఐ శంకర్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, బీఎల్‌పీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు భరత్

కామారెడ్డి రూరల్ : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు అకుల భరత్‌కుమార్ సూచించారు. శనివారం కామారెడ్డి పట్టణంలోని 10వ వార్డు పరిధిలో బీజేపీ కార్యకర్తల సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లా ఓబీసీ మోర్చా సెక్రటరీగా ఎన్నికైన కాసర్ల రాజలింగంను సన్మానించారు. కార్యక్రమంలో ప్రతాప్, 10,12, 35 వార్డుల ఇంచార్జీలు కాసర్ల రవీందర్, చిన్నోళ్ల రజనీకాంత్‌రావు, బోజన్నగారి రాజుపాటిల్, బీజేపీ కార్యకర్తలు తదితరులున్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శనివారం మాజీ మంత్రి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. మాజీ ఎంపీపీ నక్క గంగాధర్, మాజీ బీఆర్‌ఎస్ కార్యదర్శి ప్యాలాల రాములు తదితరులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

‘బీఆర్‌ఎస్‌ను వీడేది లేదు’



అమృత్‌రెడ్డి

భిక్కనూరు : మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌తో తనకు 30 ఏళ్ల నుంచి అనుబంధం ఉందని ఆయన వద్ద తన పలుకుబడిని తగ్గించాలని కొందరూ బీఆర్‌ఎస్ నేతలు కుట్రపన్ని తనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడం విడ్డూరమని భిక్కనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అమృత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన రామేశ్వర్‌పల్లి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ గంప గోవర్దన్ వద్ద నా పలుకుబడి తగ్గిస్తే తాము ఆయన వద్ద చేరవచ్చని గ్రామానికి చెందిన ఇద్దరు నేతలు కుట్రపన్ని మాజీ ఎమ్మెల్యేకు తనపై లేనిపోని అబద్దాలను చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అనారోగ్యంగా ఉన్నప్పుడు తనను గంప గోవర్దన్ ఎంతగానో ఆదుకున్నాడన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని వీడేది లేదన్నారు.

ఆధ్యాత్మికం

పెద్దమ్మతల్లికి బోనాల సమర్పణ



భిక్కనూరు : మండల కేంద్రంలోని వనదుర్గ పెద్దమ్మ ఆలయం 25వ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి పెద్దమ్మకు ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయం వద్ద బోనాలను పాండిల వారిగా అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం రాత్రి బోనాలను తిరిగి భాజాభజంత్రీలతో గృహప్రవేశం చేయించారు.

నవగ్రహాలకు ప్రత్యేక పూజలు



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ గంగిశెట్టి హనుమాన్ ఆలయంలో శనివారం నవగ్రహాలకు, శిఖరానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయం, నవగ్రహ ఆలయంలో ఏర్పాటు చేసే నవగ్రహాల విగ్రహాలకు, నూతన శిఖరానికి పూజలు నిర్వహించారు. ఆదివారం హనుమాన్ ఆలయంపై శిఖర స్థాపన, నవగ్రహ, పార్వతి దేవి, సూర్యదేవ్, నంది శ్వర విగ్రహాల ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం మహారుద్రయాగం అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.

23న కోదూరి హన్‌మాన్ జయంతి

కామారెడ్డి అర్బన్ : శ్రీహన్‌మాన్ జయంతి సందర్భంగా ఈనెల 23న మంగళవారం ఉదయం 10 గంటల నుంచి కామారెడ్డి దళితవాడలోని కోదూరు అంజనేయస్వామికి అభిషేకం, చందనోత్సవం, తదితర కార్యక్రమాలు సాయంత్రం ఊరేగింపు ఉంటుందని ఉత్సవ కమిటీ తెలిపింది. వేదపండితులు గంగవరం అంజనేయశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

శ్రీరెడ్డమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని నందివాడ గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం నిర్వహించిన శ్రీరెడ్డమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ కార్యక్రమానికి షబ్బీర్‌కు ఆహ్వానం



భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని అతిపురాతనమైన శ్రీ లక్ష్మి వేంకటేశ్వరాలయం జీర్ణోద్ధరణ కార్యక్రమం, స్వామి కల్యాణం, ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానలు 24న నిర్వహించే ఉత్సవాలకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి, జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు ఆహ్వానిస్తూ ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి సిద్ద రాములు, నేతలు కుంట లింగారెడ్డి, హరిశ్చంద్ర రెడ్డి, ఎస్సు బాల్‌రాజురెడ్డి పాల్గొన్నారు.

సలాబత్‌పూర్ ఆలయంలో భక్తుల సందడి



మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శనివారం సందర్భంగా భక్తులతో సందడిగా మారింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు విజయ్, అరవింద్, శైలేంద్ర మహరాజ్ ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. సత్యనారాయణ వ్రతాలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారికి పల్లకీ ఊరేగింపు సేవా కార్యక్రమం నిర్వహించారు.

నేడు శ్రీరుక్మిణీ విఠలేశ్వర శాంతి కల్యాణం



బాన్సువాడ రూరల్ : మండలంలోని కోనాపూర్‌లో నిర్మించిన శ్రీరుక్మిణీ విఠలేశ్వర స్వామి శివపంచాయతన మహా సరస్వతి విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా స్థాపిత దేవతా పూజ, శ్రీరుక్మిణీ విఠలేశ్వర శాంతి కల్యాణం జరుపనున్నారు. శనివారం సుదర్శన హోమం, తదితరు కార్యక్రమాలు అన్నదానం చేశారు.

సీతారామచంద్ర స్వామికి గరుడసేవ



రామారెడ్డి : ఈనెల ఉగాది నుంచి సీతారామచంద్ర స్వామి, రాజరాజేశ్వర స్వామి ఉభయ దేవాలయాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడసేవను ప్రారంభించారు. నేడు పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈనెల 23న జంట ఆలయాల రథాల ఊరేగింపు ఉభయ ఆలయాల బ్రహ్మోత్సవాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

అయ్యపల్లిలో వైభవంగా బోనాలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని అయ్యపల్లి గ్రామంలో శనివారం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు అంగరంగ వైభవంగా బోనాలు ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రతీ ఇంటికి బోనం తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల్లో పోతరాజు విన్యాసాలు నిర్వహించారు.

సంక్షిప్తం

అంబేడ్కర్ విగ్రహానికి ఘననివాళి




లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. లింగంపేట అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలన్నారు. లింగంపేట నుంచి ఎల్లారెడ్డి వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్, నాయకులు పైడి ఎల్లారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అరుణతార, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ ప్రచారం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కృష్ణాజీవాడి, కరడ్‌పల్లి, ఎండ్రియాల్, నందివాడ, ఎర్రాపహడ్, సంతాయిపేట్ తదితర గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు ఇంటింటికీ తిరుగుతూ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు అకిల్‌రావు, నాయకులు సంజీవులు తదితరులున్నారు.

మిషన్ భగీరథ నీళ్లు వృథా



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలంలోని కొట్టాల్ శివారులో మిషన్ భగీరథ పైపు లీకేజీ కావడంతో ఫౌంటెన్‌లా తలపించింది. నీరు ఎగిసి పడడంతో కామారెడ్డి– ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై వాహనదారులకు ఇబ్బందులు కలిగాయి.

భవానీపేట రోడ్డు సమీపంలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని భవానీపేట రోడ్డు సమీపంలో కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో నీరు ఎగిసిపడుతూ వృథాగా పోతుంది. పైపులైన్ సామర్థ్యానికి మించి నీళ్లు వదలడంతో ఒత్తిడి పెరిగి జాయింట్ వద్ద పైపు పగిలింది. దాంతో నీరు ఫౌంటెన్‌లా ఎగిసిపడింది. రోడ్డుపై వెళ్లే వాహన చోదకులు, ప్రయాణికులు నీరు ఎగిసిపడుతుండడాన్ని తిలకించారు.